క్లుప్తంగా

నేడు చేయూత పంపిణీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ చెక్కును నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ చేతుల మీదుగా అందజేస్తున్నట్లు తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన విద్య కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు అందించారు. ఆలయానికి ఆదివారం సాయంత్రం విచ్చేసిన దాతలకు ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాడులను అరికట్టాలి

చిత్తూరు కార్పొరేషన్: రైతులపై ఢిల్లీ పోలీసుల దాడులను అరికట్టాలని సీపీఐ–సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ ఎదుట ఆదివారం వారు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని 14న ఢిల్లీలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. రైల్వేను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాళభైరవేశ్వర స్వామికి రూ.92,561 ఆదాయం

తవణంపల్లె: కాళభైరవేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో హుండీ కానుకల ద్వారా రూ.92,561 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. అభిషేకాలు ద్వారా రూ.6500, చందాల ద్వారా రూ.25,034, కల్యాణోత్సవం ద్వారా రూ.3,582, హుండీలో వచ్చిన కానుకలను లెక్కించగా రూ.57,445 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పురుషోత్తం(ఫైల్)

బంగారుపాళెం: వ్యవసాయ బోరు విషయమై ఘర్షణలో గాయపడిన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన పురుషోత్తం, రమేష్ కుటుంబ సభ్యుల మధ్య వ్యవసాయ బోరు విషయమై తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ బోరు విషయమై ఘర్షణపడ్డారు. దీంతో పురుషోత్తం(56)పై రమేష్ కుటుంబ సభ్యులు దాడిచేశారు. ఈ సంఘటనలో పురుషోత్తం తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం మృతి చెందాడు. మృతుని భార్య జగదాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా రథోత్సవం

పుంగనూరు: మండలంలోని నెక్కుంది కొండలపై ఉన్న శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి రథాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు ఉత్సవమూర్తులపై మిరియాలు, ఉప్పు, పూలు చల్లి మొక్కులు చెల్లించారు. అంతకుముందు హోమాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి పర్యవేక్షించారు.

క్రికెట్ విజేత సామిరెడ్డి పల్లె జట్టు



విజేత జట్టుకు బహుమతిని అందిస్తున్న పెద్దలు

యాదమరి: మండలంలోని పెరుమాళ్లపల్లెలో శివరాత్రి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో మండలంలోని సామిరెడ్డిపల్లె జట్టు గెలుపొందగా, పెరుమాళ్లపల్లె జట్టు రెండో స్థానంలో నిలిచింది. పెరుమాళ్లపల్లెలో గ్రామ పెద్దలు చంద్రశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, మనోహర్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొత్తం 15 బృందాలు మూడురోజుల పాటు పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పెరుమాళ్లపల్లె జట్టు పై సామిరెడ్డి పల్లె జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు రూ.10వేలు, రన్నర్‌కు రూ.5వేలు షీల్డ్‌లను గ్రామ పెద్దలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్లపల్లె యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో కొలువైన వైఎస్సార్

- చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు సమన్వయకర్త సునీల్‌కుమార్



టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, డాక్టర్ సునీల్‌కుమార్

యాదమరి: ప్రజల మనసుల్లో గూడు కట్టుకున్న దేవుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని, ఆయన బాటలోనే నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ప్రజల మనసుల్లో దేశ చరిత్రలో నిలిచిపోతారని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. ఆదివారం మండలంలోని కొటాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త బీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు ఊరి పొలిమేర నుంచి కొటాలలోని వైఎస్సార్ విగ్రహం వరకు దారి పొడవునా పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అవుతారని, ప్రజల కష్టాలు అన్నీ తీరిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ముస్లిం మైనారిటీ డైరెక్టర్ కబీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మనోహర్, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని కొటాల పంచాయతీలో టీడీపీకి చెందిన నాయకులు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎంపీటీసీ చిన్నప్పరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బాబుకు వయసైనా ఆశ తగ్గలేదు

''చంద్రబాబు ఇప్పటికే అన్ని రకాల పదవులు అనుభవించారు.. కావాల్సినంత సంపాదించుకున్నారు.. వయసు కాస్త మీద పడుతోందా.. అయినా అధికారం మీద వ్యామోహం తగ్గలేదు.. అందుకే ఈ వయసులో కుట్రలు, కుతంత్రాలు, పొత్తు జిత్తుల రాజకీయాలు చేస్తున్నారు.'' అని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప విమర్శించారు. మండలంలో ఆదివారం వైఎస్సార్ విగ్రహావిష్కరణకు విచ్చేసిన ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు 45 ఏళ్ల రాజకీయ అనుభవంతోపాటు, 14 ఏళ్లు సీఎంగా పనిచేసినా, ఏనాడూ రాష్ట్ర ప్రజలకు మంచి చేసిన పాపాన పోలేదన్నారు. ఆయన ఆస్తి మాత్రం రెండెకరాల నుంచి రూ.లక్షల కోట్ల వరకు పెరిగిందని చెప్పారు. అయితే ఇప్పుడు ఆ అక్రమ ఆస్తులను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల కష్టాల గురించి, ప్రజలకు చేయాల్సిన మంచి గురించే ఆలోచించారని చెప్పారు. అందుకే రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి సర్కారు పెద్దపీట



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బంగారుపాళెంలోని కామరాజు గార్డెన్స్ ఆవరణలో ఆదివారం నియోజకవర్గంలోని ముస్లిం నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ముస్లిం, మైనారిటీల సంక్షేమం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి 2019లో సీఎంగా అధికారం చేపట్టిన తరువాత తండ్రికంటే రెండు అడుగులు ముందుకు వేసి ముస్లిం, మైనారిటీల బాగుకోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నకు ముస్లిం, మైనారిటీలు అండగా నిలిచి 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ, ముస్లింలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లింలకు జరిగిన మేలు ఏమీలేదన్నారు. ముస్లింలందరూ జగనన్న గెలుపునకు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, బంగారుపాళెం, ఐరాల మండల పార్టీ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా మైనారిటీ నాయకులు సర్దార్, కరీం, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ ప్రసంగించారు. నియోజకవర్గంలోని పలువురు ముస్లిం పెద్దలు, నాయకులు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న జగనన్నకే తమ మద్దతని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ, ముస్లిం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సిద్ధం.. టీవీలకు అతుక్కుపోయిన జనం!



సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న జనం

గుడిపాల: అప్పటివరకు వీధుల్లో తిరుగుతున్న జనం.. ఒక్కసారిగా వీధుల్లో కనిపించలేదు. ఎక్కడ అని చూస్తే అందరూ టీవీలకు అతుక్కుపోయారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఒక ఇంట్లో చూస్తే సాక్షి.. మరో ఇంట్లో చూస్తే ఎన్‌టీవీ.. మరో ఇంట్లో చూస్తే టీవీ–9 ఇలా జనమంతా టీవీలకు అతుక్కుపోయారు. ఏమని చూస్తే ప్రతి ఒక్కరూ మేదరమెట్లలో జరుగుతున్న సిద్ధం సభలో జగన్‌మోహన్‌రెడ్డి స్పీచ్‌లో మునిగిపోయారు. ఇంటిలో ఉన్న అందరూ పని మానేసి టీవీల ముందు కూచున్నారు. ''మీ ఇంట్లో మంచి జరిగుంటేనే ఆశీర్వదించండి'' అన్న మాట వినగానే మహిళలందరూ ఎవరయ్యా ఇలా చెప్తారు అంటూ టీవీలకు నిమగ్నమయ్యారు. ''ప్రతి అక్కా చెల్లెమ్మ నాకు అండగా ఉంటారని ఆశిస్తున్నానని, 175కి 175 ఎమ్మెల్యే సీట్లు, 25కి 25 ఎంపీ సీట్లు రావాలంటే మీ చేతుల ద్వారా ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలి.'' అని కోరారు. ఈ ఎన్నికల యుద్ధానికి మీరంతా కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీనికి తాము కూడా సిద్ధమన్నా అంటూ మహిళలు కూడా చర్చించుకోవడం కనిపించింది. మొత్తంగా సిద్ధం సభ విజయవంతమైంది.

నగరవాసులకు ఆహ్లాదం



నగరవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలోని పట్టణ, నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సమీపంలో నగరవనాలను అభివృద్ధి చేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతి రోడ్డు పెనుమూరు క్రాస్‌వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన నీవా నగరవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డితో కలిసి పార్కును చూశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చిత్తూరువాసులకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఇచ్చేందుకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్ తోపాటు ఇతర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఈ నగరవనాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పోకల అశోక్‌కుమార్, లీనారెడ్డి, కృష్ణమూర్తి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రజనీకాంత్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రభుత్వ సలహాదారు



సలహాదారుకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్ రావు దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన ఆదివారం సాయంత్రం కాణిపాకం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రావణ బ్రహ్మ వాహనంపై ఆదిదంపతులు



రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు

తవణంపల్లె: కాళభైరవేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఉభయదారులచే రావణబ్రహ్మ సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు వన్నెకుల క్షత్రియ వంశస్తులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులకు అభిషేకం పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. సుగంధ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతులైన శివపార్వతులు కొలువుదీరి పురవీధుల్లో భక్తులను కనువిందు చేశారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు అధికార నందివాహన సేవ

కాళభైరవేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11న సోమవారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, అర్చనలు చేయిస్తారని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. రాత్రిలో ఉభయదారులు మొదలియార్ కులస్తులచే అధికారి నంది వాహన సేవను భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారని వివరించారు.

నేడు వలంటీర్లతో ఆత్మీయ సమావేశం

తవణంపల్లె: మండలంలోని వలంటీర్లతో ఆత్మీయ సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం సప్తగిరి గ్రామీణ బ్యాంకు భవనంపై నిర్వహించనున్నట్లు ఎంపీపీ గీతారెడ్డి తెలిపారు. దీనికి పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంకాళ పరమేశ్వరి తిరునాళ్ల ముగింపు



ఊరేగుతున్న అంకాళ పరమేశ్వరి అమ్మవారు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలో ఆదివారం ఘనంగా అంకాళ పరమేశ్వరి ముగింపు తిరునాళ్లు వసంతాలతో ముగిసింది. రెండురోజులుగా శ్మశానకొల్లతోపాటు అమ్మవారి ఊరేగింపు, అభిషేకాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించి గ్రామస్తులు వారి మొక్కులను చెల్లించుకున్నారు. ఎక్కువగా యువత ఊరేగింపులో పాల్గొని వసంతాలతో తిరునాళ్లను ముగించారు.

నేడు స్పందన

పూతలపట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఉదయం 10.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. వచ్చిన సమస్యలను పరిశీలించి, వారంలోపు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

జిల్లాకు కేంద్ర బలగాలు

చిత్తూరు అర్బన్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. వీరితో ఆదివారం నగరి, పలమనేరులోని వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించేందుకు ఈ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, మూర్తి, ఇలియాస్ బాషా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అంబారీపై ఆదిశంకరుడి విహారం



బంగారుపాళెం: మొగిలిలో గజవాహనంపై ఆదిశంకరుడు



మొగిలిలో కామధేను వాహనంపై కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ఉదయం ఆదిశంకరుడైన శ్రీమొగిలీశ్వరస్వామి, శ్రీకామాక్షమ్మవారు అంబారీపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. గజవాహన సేవకు మొగిలివారిపల్లెకు చెందిన వసంతమ్మ, నంద, గాంధీ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

కామధేను వాహనంపై మొగిలీశ్వరుడి అభయం

మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి కామధేను వాహనంపై కటాక్షించారు. మంగళ వాయిద్యాలు, కీలుగుర్రాల ప్రదర్శనలు, చిన్నారుల కోలాటల నడుమ స్వామి, అమ్మవారు విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కామధేను వాహన ఉత్సవానికి మొగిలి నాయిబ్రాహ్మణ సంఘం వారు, పరిసర గ్రామస్తులు ఉభయ దారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మొగిలీశ్వరస్వామి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు మొగిలీశ్వర స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

కమ్మ సామాజికవర్గానికి అండగా ఉంటాం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి



భూమిపూజలో నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కమ్మ సామాజికవర్గానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కమ్మ సామాజికవర్గ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడుతూ ఇంత మంది సమావేశానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. జగనన్న నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి పట్టాలెక్కిందని, ఇక ముందు దశలవారీగా దూసుకెళుతుందని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులను నమ్మొద్దని సూచించారు. జగనన్న ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చి ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చిత్తూరు మండల జెడ్పీటీసీ బాబునాయుడు, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియ భవన నిర్మాణానికి భూమి పూజ

చిత్తూరు రూరల్: రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందని, ఈ ఐదేళ్ల పాలనలో వన్నెకుల క్షత్రియులకు పదవుల కల్పనలో పట్టం కట్టిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరం చెర్లోపల్లి సమీపంలో వన్నెకుల క్షత్రియ కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అలా కాదని, ఒకసారి మాట ఇస్తే, కచ్చితంగా నెరవేర్చేరకమని గుర్తు చేశారు. చిరకాల కోరిక నెరవేర్చేందుకు తపిస్తున్న విజయానందరెడ్డికి కుల పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నాయకర్ సంఘం సీనియర్ నాయకులు కాశి నాయకర్, కన్నన్, పిచ్చాండి, కట్టమంచి కుమార్, కెప్టెన్ శివ, చెందామరై, రాజేంద్ర నాయకర్, కార్పొరేటర్లు గణేష్, వెంకట్, శశి, తుమ్మింద కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

సేవా నిరతితో లయన్స్ క్లబ్



క్లబ్ సభ్యులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిత్తూరు రూరల్: సేవా నిరతితో ఐదు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న లయన్స్ క్లబ్, లయన్స్ గోల్డ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అజరామరం అని లయన్స్ సౌత్ ఇండియా అంబాసిడర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మ్యాంగో భవన్‌లో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, నిత్యం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్నదానం చేయడం, నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా అనేక ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటిని అందించడం, కైలాస ధామం ఏర్పాటులో లయన్స్ క్లబ్ గోల్డ్ భాగస్వామ్యం కావడం అనిర్వచనీయమన్నారు. లయన్స్ క్లబ్ ప్రాంతీయ అధ్యక్షుడు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరులో సమావేశం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, నిత్యముక్తదాస్, భానుమూర్తిరెడ్డి, భక్తవత్సల రెడ్డి, గవర్నర్ రామ్ రాజ్ అరసు, ప్రమోద్, యసనుల్ల, సుభాష్ జైన్, గౌతమ్ రెడ్డి, అశ్వత్ నారాయణస్వామి, ప్రతాప్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్మశాన కొల్లు పూజలు

కుప్పం: పట్టణంలో ఆదివారం శ్మశాన కొల్ల పూజలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని అంకాళ పరమేశ్వరి దేవాలయంలో అభిషేకాలు, పూజార్చనలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం బైపాస్‌లోని శ్మశానం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ దక్ష సంహార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా మహా శివరాత్రి మరుసటి రోజు వచ్చే అమావాస్య రోజున బెస్త కులస్తులు శ్మశాన కొల్లు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సంస్కృతీ సాంప్రదాయం తమిళనాడు రాష్ట్రం అధికంగా పాటిస్తుంటారు. తమిళనాడు సరిహద్దులో కుప్పం ప్రాంతం ఉండటంతో, ఇరు రాష్ట్రాల ప్రజలు బంధువర్గాలు కలిగి ఉండడంతో ఆ సంస్కృతి ప్రభావం ఇక్కడా ఉంటోంది. ఈ నేపథ్యంలో శ్మశానంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుంటే తమను ఆవహించిన దుష్టశక్తులు దూరమవుతాయని ప్రజల నమ్మకం ఉండడంతో అధిక సంఖ్యలో మహిళలు పూనకాలతో ఊగిపోయారు. ఈ పూజలకు కుప్పం చుట్టుపక్కల ప్రజలకే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రజలు సైతం పెద్ద ఎత్తున్న తరలి వచ్చారు. శ్మశానంలో ఏర్పాటు చేసినా దక్షుడి ప్రతిమ మట్టిని తీసుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. కుప్పం శ్మశానం అంగాళపరమేశ్వరి నామ స్మరణతో మార్మోగింది.